# వజరాలవాన

కీచు కీచు అని అరుస్తూ, కిలకిలలాడుతూ పిట్టలగుంపు ఆకాశం మీదనించి జాంయ్‌మని వచ్చి, పచ్చని జొన్న చేనుమీదికి వాల్తూంది.

సన్నని గొంతుతో ఎలుగెత్తి పాడుతూన్న పల్లెపడుచు పాట దూరాన ఉన్న కొండచరియలు అంది పుచ్చుకున్నాయి.

ప్రక్కచేనులో ఉన్న వల్లభరాయుడు పెద్ద శబ్దం చేశాడు. వాలబోయిన పిట్టలు పైకి మళ్ళినయి.

కొండలమీదినించి ప్రతి ధ్వనించిన మాధుర్యం, ఏదో ఇంద్రలోకపు అప్సర పాడినట్టూ, రాయుడు చెవులకి సోకింది.

"వజరాలా వాన కురిసేనే
ఒరిగేనే పసిడిజొన్న... ... ..."

స్వారస్యంగా, తదేక ధ్యాసతో పరిసరాన్ని పట్టించుకోకుండా, ఆ మాధుర్యాన్ని అనుభవిస్తూ నుంచున్నాడు, వల్లభరాయుడు. చేతులో ఉన్న పొన్ను కర్రమీద ఆనుకుని. ప్రతి ధ్వనించినపాట, ఆకాశ వాణిలా సన్నగా, వినీ వినబడకుండా, దిగంతాల నిశ్శబ్దపు సవ్వడిలో, కరిగిపోయింది – స్వామి ముందరవేసిన సాంబ్రాణి ధూపంలా.

రాయుడు కళ్ళు తెరిచాడు.

పిట్టలు, నిదానంగా గుండ్రంగా, చేనుమీద ఎగురుతున్నాయి.

గాలి కాస్త విసురుగా వీస్తోంది. ఆకాశంమీద మబ్బులు దగ్గరగా చేరు కుంటూన్నాయి.

ఒంటిని అంటిపట్టుకునేలాగు ఆకాశపు రంగుచీర కచ్చాపోసి కట్టుకుని, ఒడిసెల చేత పట్టుకుని, లచ్చక్క చెంగున మంచమీది నించీ క్రిందికి దూకింది.

దూరంగా, కొండల మరుగుగా ఎగిరిపోతున్న పక్షుల రెక్కల క్రింద చిగురు ఎండలో, తళుకు తళుకుమన్న మెరుపులు కనిపించినయి.

చుట్టూ ఉన్న జొన్నదంట్లకి, అదృశ్యంగా భూమిలోని సారం ఎగ ప్రాకుతూంది. లచ్చక్క కాళ్లు నేలని తన్ని పట్టుకుని నించుంది. నీలికొండలమీద అలుముకున్న అరుణ ఛాయలు, లచ్చక్క మీద పడ్డాయి. తన ముఖం ఎర్ర బడ్డది.

రెండంగలలో లచ్చక్క పక్కకొచ్చి నిలబడ్డాడు రాయుడు.

వాలుతూన్న సూర్యుడికి మబ్బు అడ్డం వచ్చింది. గాలి ఉన్నట్టుండి ఇంకాస్త బలంగా వీస్తూంది. ఇద్దరూ ఆకాశంకేసి చూశారు. "వాన వచ్చేటట్టూ ఉంది బావా." అంది లచ్చక్క. ఛటుక్కున టప్‌టప్‌మని శబ్దా లారంభించినయి. చినుకులు కావవి. రాళ్లు, వడగళ్లు. లచ్చక్క రాళ్ళు మీదబడకుండా చేతులడ్డం పెట్టబోయింది. రాయుడు వెంటనే చేతిలో ఉన్న పొన్నుకర్ర ఎత్తాడు. గిరగిర సాము చేసినట్టూ లచ్చక్క తలమీదుగా చుట్టూ విసురుగా, త్రిప్పుతూ, వడగళ్ళని ఒంటికి తగలకుండా చెదరగొట్టేసాడు.

మరి రెండు నిముషాలకి, అంత చటుక్కునా ఆగిపోయినయ్యి ఆ వడగళ్లు. గాలి తగ్గింది. మబ్బుతేలి పోయింది. ఒక్కబట్ట జల్లుపడి.

బట్టలు దులుపుకుంటూ, ఇద్దరూ మట్టి దిబ్బమీద కూచున్నారు.

"ఏం బావా, దిగులుగా ఉన్నావు, ఈవేళ?" అడిగింది ఆత్రంగా, లచ్చక్క చిరునవ్వు తెచ్చుకుంటూ.

"బాగానే ఉన్నానుగా.... అవునూ–నేనురేపు రాకపోతే....''

"పిట్టల్ని ఎవ్వరుబెదర గొడతారు?' అంది నవ్వు ఆపుకుంటూ. మనస్సులో మాత్రం ఏదో దిగులు ప్రశ్నిస్తూనే ఉంది.

"నేను లేకపోయినా, నీ పాట విని ఎప్పటిలాగానే ఆనందించి, నేను ఉన్నానే అనుకుని ఎగిరిపోతాయి:'' కాస్త నవ్వు తనూ, నటించాడు.

"అలవాటువల్లనా?" అడిగింది.

"అనుకో!"

"అయినా, నా ఒడిసేల ఉందిగా!" అంది, చేతిలో ఒడిసెల, ఆకాశంవైపు ఎక్కు పెడుతూ, కళ్ళల్లో చిలిపితనం మాయమైంది. తను దిగులు చూపిస్తే అంత పెద్ద మగాడూ నీరైపోతాడు. తను ధైర్యంగా ఉండాల, బావ మనస్సు కష్టపడకూడదు.

రాయుడికి మనస్సులో కలవర పెడుతూన్న నిన్నటి సన్నివేశం వివరంగా స్ఫురణ కొచ్చింది.

చిలక కొట్టుడు జామపండ్లు క్రింద పడక ముందే, వాటిని బెదరకొట్టి, ఆ పండ్లు కోసుకొచ్చి, లచ్చక్కకి ఇద్దామని, చెట్టు ఎక్కాడు. దూరాన్నించీ, లచ్చక్క ఏరు పిడకలు గంపలో ఎత్తుకుని వస్తూన్నది. పిల్లని చూడంగానే, తను కనపడకుండా, పళ్ళుకోసి తమాషాగాపైనించి గంపలోపడేద్దా మని, చిటారు కొమ్మల్లోకి ఎక్కాడు.

ఊరువేపునించీ బళ్ళుబాటమీద అతను కనిపించాడు-ఇటే వస్తున్నాడు. రాయుడికి ఒళ్ళంతా జెర్రులు పాకినట్టు యింది. ఇపుడు లచ్చక్క వాడికి ఎదరు పడుతుందే! గబుక్కున క్రిందికి దూకి ఆ వచ్చేవాణ్ణి రెండు లెంపకాయలు వేద్దా మనిపించింది. తొందరపడ కూడదు. అయినా, దాక్కునిఉన్న తాను, పరాకుగా ఉన్న ముస్తాఫా మీద దూకడం ఏమాత్రం మగతనం-సవ్వాలు చెయ్యాలిగాని. ఇంతకీ వాడెంత వరకూ తెగించాడో తెలియదు. కనిపెట్టి గదా శిక్ష. పైగా ఇపుడు చెట్టు దిగితే, లచ్చక్క, వాడి కోసం కాపు వేశానను కుంటుందేమో! తనమీద నాకేమన్నా సందేహం అనుకుని మనస్సు బాధ పెట్టుకుంటే! ఈఆలోచనలతో-లచ్చక్క చెట్టు క్రిందికి రానే వచ్చింది. అనుకున్నంత పనీ జరిగింది. ముస్తాఫా లచ్చక్క ముందర తార సిల్లాడు. అతన్ని పట్టించుకోకుండా లచ్చక్క చెర చెర నడుచుకుంటూ వెళ్ళ బోయింది. ముస్తాఫా చేతులు అడ్డం పెట్టాడు, దారికి, చిరు నవ్వుతో-రాయుడికి కళ్ళు ఎర్ర బడ్డాయి "ఆగు పిల్లా" అన్నాడు, ముస్తాఫా. లచ్చక్క గంప క్రిందికి దించింది.

ఇన్నాళ్ళూ వీడు లచ్చక్క చుట్టూ తిరుగు తున్నాడని, తనకి తెలుసుగాని,

ఇంతచేటు బరితెగ బడ్డాడని, అనుకో లేదు, రాయుడు. ఏమయితే అయింది. చట్టుక్కున క్రిందికి దూకుదామను కున్నాడు.

"అత నేడి?" అడిగాడు. "అతనికోసం చూస్తా ఉందావా?"

"అత నెందుకు నీకు? నీలాటి వాడితో మాట్లాడనన్నా మాట్లాడడు అతను. నీకు జవాబు చెప్పాలంటే నేనే చాలు." అంది నిర్లక్ష్యంగా.

"నీతో మాట్లాడ్డానికే వస్తా వుండా. నీజవాబు కోసం మాత్రం ఎదురు చూట్టం లేదు నేను." అన్నాడు, కాస్త కోపంగా, ముస్తాఫా.

నిర్లక్ష్యంగా, విసుకుతో, నించునే ఉంది లచ్చక్క.

"రేపు నేను బయలుదేరి, ఎల్తా ఉండా." నిశ్శబ్దం.

"పాదుషా దండులో కలుద్దామని, మాట్లాడ వేం?"

"ఎళ్ళు." అంది చలనం లేకుండా.

"ఎందుకో తెలుసా?"

"తెలియదు. తెలియాల్సినపని లేదు."

"నీ కోసం."

"ఓ!" కొంచెం, తెలిసీ తెలియని ప్రశ్న సోకింది చూపులో.

"ఓ!, లేదూ ఆఁ! లేదు. మీవాళ్ళంతా, గప్‌చిప్‌గా ఉండాల్సిందే. దండు ఈ ప్రక్కగా వస్తావుంది." .

"ఈ ప్రక్కకి ఒస్తే మాఓళ్లు గప్‌చిప్‌న ఉండరులే!"

"ఉండక ఏం చేస్తారుగాని, పాదుషాకి జయం తప్పదు."

"నోరు ముయ్యి!"

"ఏం పిల్లా అంత కోపం? ఇదంతా, నాకెందుకు లేకపోతే. నిన్ను పెళ్ళాడ డానికే. నిన్నెత్తికెళ్ళిపోతా, మా దండు ఈ ప్రక్కకి రాంగానే, మీఓళ్లు ఏమీ చెయ్య లేరు."

"నీ తరంగాదు."

ముస్తాఫా పకపక నవ్వాడు వెటకారంగా.

"ఈనాడు మావాళ్లంతా, మీ రాక్షస బలానికి ఓడిపోయినా, ఈ లచ్చక్క నీకు చిక్కదు," లచ్చక్క కళ్ళల్లో కోపం మెరుస్తోంది.

"ఆ రాయుడు ఏమీ చెయ్యలేడు.''

"అతని పేరు నువ్వు ఎత్తవద్దు, నక్క ఎక్కడ నాగలోకం ఎక్కడ!''

"చూద్దాం!"

"ఇదిగో, ఈ ఒడిసేల నావద్ద ఉన్నంతవరకూ, లచ్చక్క నీకు చిక్కదు, నమ్ము."

"ఓస్. నీ ఒడిసేల ఏం చేస్తాది? నువ్వు ఇంతదాకా, ఒక్క పిట్టనైనా, దానితో కొట్టి చంపంగా నేను చూడలే'' అన్నాడు.

"పిట్టల్ని చంపను నేను." అంది తృణీకారంగా.

"మరి?"

లచ్చక్క మాట్లాడలేదు.

"ఏం పిల్లా, ముందరే చెప్పలేదనబాక, విన్నెత్తికెళ్ళడం ఖాయం, ముస్తాఫా మనస్సుపెడితే, ఆ కార్యం అయ్యితీరాల, తెలుసా?" అన్నాడు కళ్లు ఎర్రచేసి.

లచ్చక్క, అతనికేసి, చూడకుండానే ఒడిలో ఉన్న ఒడిసేలా, ఒకరాయీ, తీసి ఎక్కుపెట్టి చెట్టుమీద ఉన్న ఒక్క పండుని కొట్టింది. గురిచూసి. చటుక్కున పండు క్రిందపడింది, దెబ్బకి.

చిటారు కొమ్మల్లో ఉన్న రాయిడికి ఒళ్లు పొంగిపోయింది. తన లచ్చక్క చేతి నిపుణతకి.

"ఇదిగో, చూడు, పిచ్చిదానిలాగా మాట్లాడబోక, నీతో నేను కయ్యానికి ఒస్తే గా నీఒడిసేల భయంనాకు. నిద్దట్లో ఉన్నపడు ఎత్తుకుపోయి, మా దేరాలో పడేస్తాను. నీ రాయుడూ ఏమి చెయ్యలేడూ, నీ ఒడిసేలా ఏమీ చెయ్యలేదు."

"అదిగో రాయుడు పేరెత్తొద్దు, చెబుతున్నా. ఈ నీచ విషయం అతనిదాకా ఒద్దు. అసలు నీ విషయమే అతనికి తెలియదు. భద్రంగా ఉండు!" అని అమిత కోపంతో తిరిగి గంప నెత్తిని పెట్టుకుంది.

"ఖబడ్దార్! సైతాన్"

"ఛీ! ఛీ! లచ్చుక్క నీకు చిక్కదు!" అంటూ రుద్రకాళిలా, అందెలు కడియాలు, గళ్ గళ్ మంటూ, చెట్టుక్రింద నించీ వెళ్ళిపోయింది.

ముస్తాఫా ముఖం కందగడ్డ అయిపోయింది. లచ్చుక్క వంకే చూస్తూ తల పంకించి, పళ్లు పట పట కొరికాడు. ఎర్ర చేతి రూమాలు కొస పట్టుకుని గుండ్రంగా తిప్పుతూ ఒక్క క్షణం నించున్నాడు. ఏదో ఆలోచన దృఢమైనట్టూ, గబగబా అంగలు వేసుకుంటూ, నడిచి ఊళ్లోకి వెళ్ళిపోయాడు.

కొమ్మల్లోఉన్న రాయుడు, అలాగే కూచోబడిపోయాడు - తన ఆలోచనల్తో.

★ ★ ★ ★

"అవును, రేపు ఎందుకురావు బావా?'' అడిగింది, నవ్వుతూ, లచ్చుక్క.

"నిన్న నువ్వెందుకు రాలేదు?'' అడిగాడు, రాయుడు.

"రాకపోతే, ఏం? నువ్వు బెదర గొడతావుగా, పిట్టల్ని." ముఖంలో పైకి నవ్వు ఉన్నా అప్రయత్నంగా, నిన్నటి దుష్టఘడియలు, మనస్సులో మెదిలినయి.

నిన్న ఇంటికి వచ్చిన లచ్చుక్కకి మనస్సులో ఏవో మసకలు క్రమ్మినయి. స్నానం జేసి వంటచెయ్యాల-మంచాన్న ఉన్న తాతకైనా,-తనకి తినాలని లేదు.

దొడ్లో నూతిలో చేదవేసింది. వంగి చూసింది. నీళ్ళు కనబడలే-లోతు. తలలో ఆలోచనలు బరువుగా తిరిగినయి. రాయుడికి ఏ ఆపదా రాకూడదు. తను ధైర్యంగా ఉండాలి. రాయుడు గుండె నొచ్చుకోకూడదు. తను నడుం కట్టుకోవాలి.

చేద బరువుగా లేచింది చేతిలో-నీళ్ళతో.

కళ్ళలో క్రమ్మిన నీళ్లు ఆరిపోయినయి. ఎక్కడలేని ధైర్యంతో పవిటచెంగు బిగించి నడుములోదోపి బిందె ఎత్తుకుంది- చులాగ్గా.

అయినా, చేలోకివెళ్ళ బుద్ధికాలేదు, నిన్నంతా, లచ్చుక్కకి.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు రాయుడు.

జవాబు చెప్పకుండా, ఒడిలో ఉన్న మోదుగు ఆకు పొట్లం తీసి విప్పి ఇచ్చింది. "పుల్లట్లు నీకనే నిన్న బియ్యం నానబెట్టి, ఇందాక చేశాను'' అంది.

"నీకు పళ్లు తెద్దామను కున్నా... కాని, అది సరే.... రేపు రాణిగారు దండులో కలసి వెళ్తాను-రంగంలోకి."

"నువ్వా! ఏం? ఎందుకు?" గాభరాగా అడిగింది.

"పడుచుకారు వాళ్ళంతా పోతున్నారుగా!'' అన్నాడు ఆలోచనగా.

"నన్ను కాపాడతా వనుకున్నాను.'' మాట జారింది, అప్రయత్నంగా.

"నిన్ను కాపాడ డానికే వెళ్తా వున్నాను,'' అన్నాడు.

"నన్నా? ఏం? నాకేమి ఆపద?" అడిగింది. పెదిమలమీద చిరునవ్వు పెట్టుకుని.

"అంటే... నీలాంటి ఆడ వాళ్ళని. ఎంతమంది లేరు, దేశంలో ఆడవాళ్ళు. రాణిగారు కూడా, ఆడ వాళ్ళేగా. అసలు దేశంలోఉన్న ఆడ వాళ్ళందర్నీ కాపాడాలగా," అన్నాడు సర్దుకుని. మనస్సులో ముస్తాఫా ముఖం మెదు ల్తోంది, రాయుడికి. ఊళ్ళో వాణ్ణి ఏమీచెయ్యి లేం, వాడి వాళ్ళు చాలామంది. మనకి బలగం తక్కువ. పైగా, ఏ నేరం మీద వాణ్ణి చంపడం? చంపితే రాజ చట్టం? వాణ్ణిధర్మ యుద్ధంలోనే హతమార్చాల, వాడు చస్తే లచ్చక్కకి క్షేమం. వాడున్న సేనలన్నీ ఓడిపోతే దేశానికి క్షేమం.

"నువ్విది వరకు ఎన్నడూ ఆ మాట నాతో చూచాయగానైనా అనలేదే?" అడిగింది. కాస్త దిగులుగా.

"మన పెళ్ళికి, ఇంకా రోజు లున్నాయిగదా అని. ఇన్నాళ్ళూ, కోట కొలువు లోనే ఉందా మనుకున్నాను. యుద్ధం వస్తావుంది అని తెలియం గానే, ఇటు నిన్నూ ఒక కంట చూసుకుంటూ ఉండవచ్చు అనుకున్నాను'' అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

"కోట చూసుకోటానికి ఎవ్వరు బడితే వాళ్ళే చాలుగా. ఆపద వేళల్లో, నీలాంటి ప్రాయంలోఉన్న వాళ్ళంతా పోరు కెళ్ళాల్సిందే, దేశాన్ని చూసుకోవాలిగా," అంది నిదానంగా, మనస్సులో కాస్త బాధతోనే, కాని, ఒక ప్రక్కన తృప్తి గలిగింది. ఊళ్ళో మగ వాళ్ళు తగ్గారు. బావ ఒంటరి గాడయి పోయాడు. ఆ ముస్తాఫాని హతమార్చాలంటే, బావ యుద్ధంలోకి వెళ్ళడమే మంచిది.

"నేను, నాభద్రంలో ఉంటాలే, బావా వెళ్ళి శత్రువు లందరినీ కడతేర్చిరా'' పాదుషా సైన్యాలలో రేపణ్నించీ, ముస్తాఫా ఒకడు.

"నా ప్రాణం ఉన్నంత వరకూ పాదుషా దండులో ప్రతీ వాణ్నీ చంపిగాని రాను, తిరిగి," వాళ్ళల్లో ముస్తాఫా చావాల్సిందే.

"పాలి మేరలలోనే, తరిమి చంపెయ్యండి.''

కాస్సేపు నిశ్శబ్దం.

చేతిలో ఉన్న పుల్లట్లు నోట పెట్టనే లేదు వల్లభరాయుడు.

"లచ్చీ! పిట్టలకోసం పాట పాడుతూనే ఉంటావా నేను పోరుకెళ్ళిన తరువాత?"

"నీకు వినిపిస్తుందా, బావా-అంత దూరానికి?''

"కొండలలో నించీ మారు మ్రోగిన నీపాటలో ఒక్కొక్క పలుకూ, రణభేరి మ్రోగి నప్పుడల్లా వినిపిస్తానే ఉంటాది."

మాటలు లేవు ఒక్క క్షణం కాలం.

"నువ్వు తిరిగి ఒచ్చేదాకా బతుకుతాను బావా!"

కంఠంలోంచి బలవంతాన పెల్లు కొచ్చింది ఆమాట.

చుట్టూ చీకటి పడుతూంది. దూరానఉన్న చెట్ల ఆకులు నల్లగా కనిపిస్తున్నాయి. ఎక్కడో తప్పి పోయిన లేగ దూడ 'అంబా' అంటోంది-తల్లి కోసం, రక్షణకోసం చీకటి పడుతూంటే భయపడి గాబోల్ను.

లచ్చక్క రెండు చేతులతో ముఖం కప్పుకుని, తలవంచి మోకాళ్ళమధ్య పెట్టుకుంది. అణుచుకోలేని, ఆపుకోలేని దుఃఖం పొంగు కొస్తూంది.

కోటలో యోధులకి శిక్షణ ఇస్తున్నారు. రంగంలోకి పంపే వాళ్ళని పంపు తున్నారు.

రోజులు గడుస్తున్నాయి. కోటలో ఆందోళనలు ఎక్కువవుతున్నాయి.

శత్రు సైన్యాలు పాలి మేరలు దాటి ఊళ్ళు ఆక్రమించు కుంటున్నారు.

పొలం పనులన్నీ ఆడవాళ్లే చేస్తున్నారు.

గాలి కబుర్లూ, పుకార్లూతప్ప, లచ్చక్కకి రాయుడు దగ్గర నించీ వార్తలు లేవు. ఒక ఊళ్లో శత్రు సైన్యాలు చెదిరి పారిపోయారు అని వినబడగానే, కోటలో రాణి హృదయం పొంగినట్టూ, లచ్చక్క గుండెలు, ఉల్లాస పడేవి-ఆ బీద ఇంట్లో. ఒక వేళ బావ ఆ ఊళ్ళోఉన్న మన దండులోనే ఉన్నాడేమో! ఆ పారిపోయిన రాక్షస బలగంలో ముస్తాఫా ఉన్నాడేమో, విరగడై పోతేనా, వాడు.

కాని, రోజులు గడిచిన కొద్దీ, శత్రు బలాలు ఎక్కువవు తున్నాయి. లచ్చక్కకి గుండెలు బరువెక్కు తున్నాయి. రాయుడెక్కడున్నాడు? చీలి పోరాడుతూన్న మన బలంలో ఏ వేపున ఉన్నాడో?

దండులో ఉన్న రాయుడు మాత్రం. ముస్తాఫా ఉనికి, గమనిస్తూనే ఉన్నాడు. వాడుఉన్న బలాన్ని పాదుషా స్వయంగా నడుపుతున్నాడు. ధర్మ యుద్ధంలో వాణ్ణి హతమార్చాల. అదీ దీక్ష. అందుకని పాదుషా దళం ఏ పక్కనించీ వస్తూంటే, తనూ, ఆప్రక్క ఎదిరించే సైన్యంలోనే కొలు మార్పించు కునేవాడు. చాక చక్యం చూపి, చేతి కౌశలం చూసి అధికారులు అతన్ని తీవ్ర రంగంలోకే పంపుతున్నారు. వాళ్ళ ఇష్టం ప్రకారమే.

శౌర్య సాహసాలతో పోరాడు తున్నారు రాణి సైన్యం.

కాని, పాదుషా సైన్యాలు, దేశీయ సైన్యాలని తుడిచి పెట్టుకుంటూ, అడుగు అడుగూనేల ఆక్రమించు కుంటూ జొరబడుతున్నయి రాజ్యంలోకి.

లచ్చక్కకి అడుగులు తడబడుతున్నాయి. తెలియని దిగులు, మనస్సుని తింటోంది. అల్లాగే పొలంలోకి వెళ్లి వస్తూంది. తిండి తీర్థాలు సరిగా తినడం మానేసింది. తాతగారూ పోయారు. ఒంటికత్తె.

పాదుషా సైన్యం, తన గ్రామంతట్టు వస్తూంది. ఊరుకి ఆమడ దూరంలో గుడారాలు దించారు. హోరా హోరీగా యుద్ధం అయింది. రాణిగారి సైన్యం ఓడి పోయింది. సహాయపు సేనలు వచ్చేవరకూ ప్రక్క ప్రక్కగా ఒదిగారు, యోధు లంతా. శత్రు సైన్యాలు వారు విశ్రాంతి తీసుకుంటున్నారు.

లచ్చక్కకి కన్ను అదురుతూంది. కాళ్లు తేలి పోతున్నయి, నడుస్తూంటే. ఏదో,

హృదయంలో ఆపద ఛ్ఛాయలు ఆవరించినయి. కళ్ళల్లో మట్టుకు నీళ్లు రావడం లేదు. బావ ఎట్లా ఉన్నాడో!

ఆ సాయంత్రం పొలంలో గొడ్లని కాచే కుర్రా డొకడు, లచ్చక్కతో చెప్పాడు. ముస్తాఫా ఆ గుడారాల్లో ఉన్నట్టూ, వాడి చేతికి కాస్త డబ్బూ రొట్టె ఇచ్చినట్లూ లచ్చక్క ఉళ్ళో ఉందా అని చూచివచ్చి చెప్పమన్నట్టూ. అదంతా, చీకటి పడిన తరువాత తన గుడారాలకి బయటగా కుర్రాడి కబురు కోసం, గుర్రంతో కాచుకుని ఉంటా నన్నాడట కూడాను.

చెదిరి పోయిన రాణి రాణువలో ఉన్న వల్లభరాయుడు, రెప్ప వేయ కుండా, స్వయంగానూ, గూఢ చారులని పెట్టీ ముస్తాఫా చర్యలన్నీ గమనిస్తూనే ఉన్నాడు. సహాయ సైన్యాలు వచ్చే వరకు, యోధుల్ని చప్పుడుచెయ్యవద్దన్నాడు. సైన్యాధికారి, గుట్టమీద శివాలయం వెనక చెట్టు ప్రక్కనించీ, కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని, పాదుషా గుడారాలకేసి చూశాడు వల్లభరాయుడు.

దూరాన్న దూసినకత్తి ఒకచేత్తోపట్టుకుని, గుఱ్ఱం కళ్ళెం మరో చేత్తో పట్టుకుని, ఇంకా ఇద్దరు మొరటుమనుష్యులతో ఏదో ఆలోచనగా మాట్లాడుతూ వున్నాడు ముస్తాఫా. కత్తి చెయ్యి చూస్తే, గ్రామం వైపే చూపిస్తున్నాడల్లే ఉంది. వల్లభరాయుడికి ఒళ్ళు కంపించింది. దుష్టుడా! రాత్రి లచ్చి నిద్రలో ఉండగా, ఎత్తుకు రావడానికా, ఆ ప్రయత్నం, పిరికిపందా!

ఒక్క పరుగున గుట్టదిగి, గుడారాల వేపుకి పరిగెట్టాడు పులిలా. ఈలోపుగా, ముస్తాఫా, అనుచరులతో గుడారాల లోపలికి వెళ్ళి పోయాడు. లాభంలేదు. తను ఒక్కడు. వాళ్ళు వేలమంది. తనకి మృత్యువు తప్పదు. అప్పుడు లచ్చిని కాపాడడానికి ఎవ్వరూ ఉండరు. అదిముఖ్యం. లచ్చిని కాపాడాలి, ఈ రాత్రి.

ఊళ్ళో లచ్చక్కకి, ఏమీ పాలు పోలేదు. చీకటి పడుతూంది. ఈరాత్రి ముస్తాఫా తప్పక వస్తాడు-రహస్యంగా, నిద్రలో తన్ని ఎత్తుకు పోవడానికి. తను నిద్ర పోకూడదు. చిలక కొయ్యకి తగిలించి వున్న ఒడిసెల తీసింది. నారు లాగి చూసు కుంది. ఒళ్ళోరాళ్ళుకట్టుకుంది. తలుపులు గడియ వేసుకుని కిటికీ దగ్గరగా రోలు లాగుకుని దానిమీద కూర్చుంది-బయటికి చూస్తూ.

ఎదురుగా పొలాలు. అక్కడక్కడా గుబురుగా తుమ్మచెట్లు. మధ్య మధ్య నిటారుగా తాటిచెట్లు. చీకటి ఎక్కువైంది. చెట్లు వివరాలు తెలియడం లేదు.

నిమ్మళంగా, శబ్దం లేకుండా, లచ్చి గుమ్మంలోకి వెళ్లాల. ఒక వేళ అక్కడే ఎవ్వరినైనా, కావలి ఉంచాడేమో, ముస్తాఫా. లచ్చి పారిపోకుండా, గుమ్మందగ్గర తాను కావలి వుండాలి. ఈ దుష్టుడు ముస్తాఫా, వాడి వాళ్లా చీకటి చాటున, గుమ్మంలోకి వచ్చేటప్పుడే ఒక్కొక్కళ్లే ఒక్కక్క కత్తి వేత వెయ్యాలి. వల్లభరాయుడు ఆవేశం పట్టలేకపోయాడు. ఒరలోంచి కత్తి బయటికి తీసి పదును చూచు కున్నాడు. ప్రక్కన చింతచెట్టుకి కట్టి వేసి ఉన్న తన గుఱ్ఱం సకిలించింది. చుట్టూ చిమ్మ చీకటి, చెట్టు మీద మెరుగుడు గువ్వలు మెరుస్తున్నాయి. ఊరు వేపు చూశాడు. అయోమయం. ఊరు ఎక్కడుందో కూడా తెలియడం లేదు. చీకటి.

ఎక్కడా అలికిడిలేదు. ఆకు అల్లాడడం లేదు. లచ్చక్క వాకిట్లో పువ్వుల చెట్ల ప్రక్కన, కత్తి చేతపట్టుకుని ఒదిగి కూచున్నాడు రాయుడు. గబ్బిలం ఒకటి, శబ్దం లేకుండ, గట్టిగా రెక్కలతో గాలి విసిరి, అతని మీదుగా ఎగిరి పోయింది. ఎండు టాకుల మీద తొండ కాబోలు పరిగెడుతూంది. జల జల శబ్దం చేసుకుంటూ.

ఏమిటా శబ్దాలు? ఎక్కడ టక్. టక్ తన గుండెలు. ఎంత పెద్దగా కొట్టు కుంటున్నాయి! కదూ. గుఱ్ఱపు డెక్కలు. అవును గుఱ్ఱపు అడుగులు-చాలా దూరాన. దగ్గర కొస్తున్నాయి.

రాయుడు, శబ్దం చెయ్యకుండా, అల్లాగే కూచుని ఉన్నాడు.

గుఱ్రపు పరుగులు నిల్చి పోయినయి. వివరాలు లేని మనిషి అలికిడి నిశ్శబ్దంలో వినవస్తోంది.

లచ్చక్క చీకట్లో, కిటికీలో ఒడిసెల గురిపెట్టింది, బయటికి చూస్తూ. ముస్తాఫా దొంగతనంగా, రహస్యంగా వస్తున్నాడు. పాపి! ద్రోహి. తను నిద్రపోయిం దను కుంటున్నాడు, కట్టి ఎత్తుకుపోదామనుకుంటున్నాడు. బావ ఎక్కడున్నాడో!

క్షణాలూ, ఘడియలూ, యుగాలలా గడుస్తున్నాయి.

సేపయింది. ఏక్షణంలోనైనా ఎదురుగా రావచ్చు ముస్తాఫా, శబ్దం చెయ్యకుండా.

ఆకాశం మీది నించి రాలు చుక్క ఒకటి రాలింది.

ఇంతలు అంతలు చేసుకుని చూస్తున్న లచ్చక్క కళ్ళకి, వాకిట్లో దూసిన కత్తి మెరిసినట్లు కనిపించింది. ఆను చూసి గురి పెట్టి, ఒడిసెల వదిలింది.

వీధి మొగదలని, చేను గట్టు మీద ఉన్న రాయుడు గుల్లాం, వంగి వంగి వచ్చే మనుష్యులని చూసి, కాలు నేల దూసి, సకిలించింది.

గురిగా, శరవేగంతో వచ్చిన రాయి తగలగనే, రాయుడికి కళ్ళు చీకట్లు క్రమ్మినయి... ఏమిటో.... అది.... ఆఁ! రాయి మీద కూచున్న రాయుడు, క్షణికంలో, క్రిందికి ఒరిగి పోతున్నాడు. చెవుల్లో, తలలో ఏవేవో శబ్దాలు. అంతా అయోమయం.

హృదయంలో లచ్చక్కపాట, కొండ చరియలమీద నించీ, వినిపిస్తోంది.

"ఒరిగేనే పసిడి జొన్న....
ఒడిసెలా, నారు తెగనేయమ్మా...."

ఒక్క, క్షణికంలో అంతా జరిగి పోయింది, రాయుడిక, కదల లేదు.

✤ ✤ ✤